క్లుప్తంగా

అభివృద్ధి పనుల పరిశీలన



మక్తల్: పట్టణంలో వ్యవసాయ మార్కెట్‌యార్డులో రూ. 72 లక్షలతో చేపడుతున్న అభివృద్ధి పనులను ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. ఈకార్యక్రమంలో మాగనూర్ జెడ్పీటీసీ వెంకటయ్య, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, రాంలింగం తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు స్వీట్ల పంపిణీ

ధన్వాడ: ఇటీవల జరిగిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం బలపరిచిన అభ్యర్థి ఏవీఎన్‌రెడ్డిని గెలిపించడం పై తపస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మండల శాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు మిఠాయిలు తినిపించి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శేర్ కృష్ణారెడ్డి, నరసింహ మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గోవిందు, జిల్లా సలహాదారుడు రామచందర్, మండల ప్రధాన కార్యదర్శి శేఖర్, నరేందర్, చిన్నరాయుడు, నరసింహాచారి, నాగార్జునరెడ్డి, నరసింహారెడ్డి, రవికుమార్ తదితరులు ఉన్నారు.

ఆటో, బైక్ ఢీ : ఇద్దరికి తీవ్రగాయాలు

దామరగిద్ద: ఆటో, బైక్ ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలైన ఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే మండలంలోని ఉడ్మల్‌గిద్దకు చెందిన హన్మంతు ద్విచక్రవాహనంపై రాత్రి 10 గంటల సమయంలో దామరగిద్ద నుంచి గ్రామానికి బయలుదేరాడు. ఉడ్మల్‌గిద్ద సమీపంలో ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొట్టడంతో హన్మంతుతో బైక్‌పై ఉన్న చిన్నారి ఐశ్వర్యకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతోవారిని చికిత్స నిమిత్తం నారాయణపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. హన్మంతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్‌రావ్ తెలిపారు.

నోట్ బుక్స్ అందజేత

ఊట్కూరు: బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు ఎల్కోటి జనార్దన్‌రెడ్డి త్వరలో పాఠశాలలో లైబ్రరీ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సూర్యప్రకాష్‌రెడ్డి, క్లబ్ సభ్యులు సత్యనారాయణరెడ్డి, హనుమంతు, భరత్, వసంత్‌కుమార్, ప్రధానోపాధ్యాయుడు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలపై నిరసన

మక్తల్: పేపర్‌లీక్ వ్యవహారంపై బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. . సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని, కేటీఆర్‌ను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ కర్నిస్వామి, జిల్లా అధ్యక్షుడు భరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాలనలో ప్రభుత్వాలు విఫలం



కోస్గి: ప్రజా సంక్షేమంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని టీపీసీసీ సభ్యుడు వార్ల విజయ్ కుమార్ అన్నారు. హాథ్ సే హాథ్ జోడో పాదయాత్రకు మద్దతుగా మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం నాచారం లో యాత్ర చేపట్టారు. మండల అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు బెజ్జు రాములు, పట్టణ అధ్యక్షుడు తుడుం శ్రీనివాస్, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఉందేకోడ్‌లో..



దాసర్‌దొడ్డిలో..



మాధవరంలో..



కంసాన్ పల్లిలో ..

హామీలు నిలబెట్టుకోవాలి



నిరసన దీక్షలో మాట్లాడుతున్న విజయ్‌కుమార్

మక్తల్: రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెలబెట్టుకొని మాదాసీ కుర్వలకు ఎస్సీ ధ్రువపత్రాలను ఇవ్వాలని రాష్ట్ర సంఘం అధ్యక్షుడు విజయ్‌కుమార్ అన్నారు. సోమవారం అంబేద్కర్ చౌరస్తాలో సంఘం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. అంతకుముందు భారీ ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు వాకిటి శ్రీహరి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొండయ్య మద్దతు పలికారు. విజయ్‌కుమార్ మాట్లాడుతూ మక్తల్‌లో కేసీఆర్ నిర్వహించిన సభలో స్పందించినా నేటి వరకు అమలు చేయడంలేదని అన్నారు. అనంతరం మక్తల్ తహసీల్దార్ తిరుపతయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో రాష్ట నాయకుడు కుర్వ సాబెన్న, ప్రధాన కార్యదర్శి జయరాములు, ఉపాధ్యక్షుడు బాలరాజు, బైరి వెంకటేష్, యాంకే వెంకటయ్య, కుర్వలింగప్ప, యల్లాంగప్ప, రాజప్ప, సర్పంచు కుర్వహన్మంతు, అంబ్రేష్, రాజు, అంజయ్య, సాబెన్న, ఆంజనేయులు, సత్యం, సావిత్రి, సంగీత, లక్ష్మి, రాధ తదితరులు కులపెద్దలు నాయకులు పాల్గొన్నారు.

‘కంటివెలుగు’ ప్రారంభం



పరీక్షలు చేస్తున్న సిబ్బంది

మరికల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటివెలుగు కార్యక్రమం కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి వరమని జెడ్పీవైస్ చైర్ పర్సన్ సురేఖ అన్నారు. మండలంలోని మాధవరంలో సోమవారం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో కంటి సమస్యలు ఉన్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తీవ్ర కంటి సమస్యలు ఉన్నవారికి శస్త్ర చికిత్సలకు పంపిస్తారని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పుణ్యశీల, ఎంపీటీసీ ఆంజనేయులు, ఉప సర్పంచ్ విష్ణుకాంత్‌రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మాగనూర్: పర్మన్‌దొడ్డి గ్రామపంచాయతీ కార్యాలయంలో సోమవారం సర్పంచ్ వెంకటేశ్వరమ్మ కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉపసర్పంచ్ వెంకటప్ప, పంచాయతీ కార్యదర్శి రాజు, వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

నర్వ: జెడ్పీటీసీ గౌనిజ్యోతి సోమవారం బెక్కర్‌పల్లి కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ... రుగ్మతలను బట్టీ అక్కడిక్కడే రీడింగ్ గ్లాస్‌లను అందిస్తున్నారన్నారు. శస్త్రచికిత్సలు అవసరమైన వారిని గుర్తించి జిల్లా ఆస్పత్రికి రెఫర్ చేస్తున్నట్లు వివరించారు. శిబిరాన్ని వినియోగించుకోవాలని సూచించారు. సర్పంచ్ గౌరమ్మ, గ్రామ పెద్దలు హన్మంతు, రాంరెడ్డి, నారాయణ, రవి, సుధాకర్, తదితరులున్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



బోయిన్‌పల్లిలో వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

నారాయణపేట రూరల్ : మండలంలోని బోయిన్‌పల్లి యూపీఎస్‌లో సోమవారం స్వపరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కలెక్టర్‌గా శివానంద్, డీఈఓగా సమీర్, ఎంఈఓగా మౌనిక, హెచ్‌ఎంగా నర్మద వ్యవహరించగా పలువురు విద్యార్థులు టీచర్లుగా విధులు నిర్వర్తించారు. సర్పంచ్ త్రివిక్రమరావు, ఎంపీటీసీ బాలమణి, ఎస్ఎంసీ చైర్మన్, పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జనార్దన్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు బసదయ్య, టీచర్లు కృష్ణ పాల్గొన్నారు.

నర్వ: మండలంలోని కొత్తపల్లి మండల పరిషత్ పాఠశాలలో సోమవారం స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఒకరోజు ఉపాధ్యాయులుగా మారి తోటి వారికి పాఠాలు బోధించారు. ఉపాధ్యాయులు ప్రవీణ్‌కుమార్, లక్ష్మీ, విద్యాకమిటీ చైర్మన్ ఆశప్ప, వైస్ చైర్మన్ అశోక్, ఉప సర్పంచ్ సువర్ణ పాల్గొన్నారు.

కళాకారులే సమాజ మార్గదర్శకులు



సన్మానం చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

నారాయణపేట రూరల్ : తేనెలొలుకు తెలుగు భాషకు జీవం పోసి సంస్కృతి, సాంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందిస్తున్న కవులు, కళాకారులు నిజమైన సమాజ మార్గదర్శకులని మున్సిపల్ చైర్ పర్సన్ గందె అనసూయ అన్నారు. పట్టణంలోని బాలకేంద్రం ఆవరణలో సోమవారం రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రపంచ కవితా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కవులు, కళాకారులను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షులు సుదర్శన్ రెడ్డి, బాలకేంద్రం సూపరింటెండెంట్ మహిపాల్ రెడ్డి, కవులు జ్ఞానేశ్వర్‌గౌడ్, దానయ్య, రామ్మోహన్ రావు, అవుటిమల్లేషం, చిన్నయ్య, శ్రీశైలం, బాలాజీగౌడ్, చిన్నారులు సువర్ణ, శ్రావణి, రెడ్‌క్రాస్ సభ్యులు సరాఫ్‌నాగరాజు, మధుసూధన్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, సుభాష్, చెన్నారెడ్డి, వెంకట్రాములు, బాలకేంద్రం సిబ్బంది వసంత్, జ్ఞానామృత పాల్గొన్నారు.

పత్తి కొనుగోలు చేయాలని ధర్నా

నారాయణపేట టౌన్ : పత్తిని కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు అంజిలయ్య గౌడ్, అశోక్ మాట్లాడుతూ రైతుల వద్ద మిగిలిపోయిన పత్తిని సీసీఐ ద్వాఆర కొనుగోలు చేయాలని, కింట్వాలుకు రూ. 12 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పత్తి మిల్లు యజమానులు తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారని, తుకాల్లో మోసం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టరేట్‌లో ఏఓ నర్సింగ్‌రావుకు వినతి పత్రం అందించారు. కార్యకరమంలో రైతు సంఘం నాయకులు బాలప్ప, దస్తప్ప, శివప్ప, శంకర్, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా బాలమేళా



మల్లెపల్లిలో వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు

మరికల్: మాధవరంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం బాలమేళా కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ పుణ్యశీల, ఎంపీటీసీ ఆంజనేయులు, సూపర్‌వైజర్ అమ్మక్క, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

మక్తల్: దాసర్‌దొడ్డిలో వేడుకల్లో సోమవారం విదుర్ కుమార్, కిరణ్, వరుణ్, టీచర్లు బసలింగమ్మ, సువర్ణ, కవిత, నర్మదా పాల్గొన్నారు.

నర్వ: ఉందేకోడ్, రాజుపల్లి, లంకాల్, కొత్తపల్లి, జంగంరెడ్డిపల్లి, బుడ్డెగాని తండా, జక్కన్నపల్లి గ్రామాల్లో సోమవారం ప్రీస్కూల్ మేళా నిర్వహించారు. సూపర్‌వైజర్ అరుణ, ఉందేకోడ్‌లో సర్పంచ్ నెల్లూరి పావని పాల్గొన్నారు.

మాగనూర్: మండలంలో నిర్వహించిన వేడుకల్లో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, చిన్నారుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

దామరగిద్ద: కంసాన్‌పల్లిలో వేడుకల్లో సర్పంచ్ గురునాథ్‌గౌడ్, సూపర్‌వైజర్ రూప, ప్రథమ్ సూపర్‌వైజర్ కవిత, అంగన్‌వాడీ టీచర్‌లు రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఊట్కూరు: మండలంలోని మల్లెపల్లి, అవుసలోనిపల్లి గ్రామాలలో జరిగిన వేడుకల్లో సర్పంచ్‌లు మాణిక్యమ్మ, హనుమంతు, కార్యదర్శులు శివరాజు, సుజాత, ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్ రెడ్డి, నర్సింగప్ప, అంగన్వాడీ టీచర్‌లు రామేశ్వరి, రాజేశ్వరి, రేణుక తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు

కోస్గి: ప్రభుత్వ వసతి గృహాల్లో దోమల నివారణ కోసం అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఈ మేరకు సోమవారం పట్టణంలోని ఎస్సీ బాలికల వసతి గృహంలో జిల్లా వైద్యాధికారి కార్యాలయం నుంచి రాపిడ్ రెస్పాన్స్ బృందం సభ్యులు వచ్చి డీడీటీ-50 మందును పిచికారీ చేశారు. బృందం ప్రతినిధులు శంకర్, శ్రీనివాస్, చంద్రశేఖర్ రెడ్డి, రాంచందర్ జీ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

మద్దూరు: మండల కాంగ్రెస్ నూతన అధ్యక్షుడిగా మోమినాపూర్ గ్రామానికి చెందిన జి. నర్సింహ ఎన్నికయ్యారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కార్యవర్గ సభ్యుడిగా మద్దూరుకు చెందిన జంగం బాబు స్వామి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బర్ల మల్లికార్జున్, ప్రధాన కార్యదర్శిగా ఎం. మహిపాల్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా చంద్రప్ప, శ్రీనివాస్‌రెడ్డి, హుసేన్, గడ్డం సాయప్ప, రాంచందర్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా గణప చంద్రమోహన్, ప్రధాన కార్యదర్శిగా రఘుపతిరెడ్డి, ఉపాధ్యక్షుడిగా సలీం, ముద్దిచిన్న, కృష్ణ, ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడిగా ముద్ది సుభాష్, ప్రధాన కార్యదర్శిగా జంగేటి కనకయ్య, ఎస్టీ సెల్ మండలాధ్యక్షుడిగా లక్ష్మణ్‌నాయక్, ప్రధాన కార్యదర్శిగా సంజీవ్‌నాయక్‌లు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి పార్టీ నాయకులు సంజీవ్, శివరాజ్, మహేందర్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, రహీం, సంజీవ్, కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

24న కలెక్టరేట్ ఎదుట నిరసన

నారాయణపేట రూరల్ : ఈ కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల బిల్లులను మార్చి నెలాఖరులోగా చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 24న కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్నట్లు టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డప్ప తెలిపారు. పట్టణంలోని భగత్‌సింగ్ భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మిగులు రాష్ట్రంలో కనీసం జీతాలు చెల్లించలేని దుస్థితికి సీఎం కేసీఆర్ ప్రభుత్వం తీసుకుని వచ్చిందని విమర్శించారు. 1వ తేదీన జీతాలు తీసుకోవడం కలగా మరిపోయిందని, జీపీఎఫ్‌లో దాచుకున్న సొమ్మును సైతం నెలల తరబడి వేచిచూడాల్సిన దౌర్భాగ్య స్థితికి చేరుకున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సరెండర్ లీవ్‌లకు సంబంధించిన బిల్లులు ఆలస్యమవుతున్నాయని, మెడికల్ రియాంబర్స్‌మెంట్‌కు కాలం చెల్లిందని అన్నారు. పోరాటాల ద్వారానే ప్రభుత్వాన్ని కదిలిద్దామని ధర్నాకు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. సమావేశంలో దశరథ్, రామకృష్ణ, గజలప్ప, రమేష్ పాల్గొన్నారు.

విద్యార్థుల సమయానికి బస్సులు నడపాలి

నారాయణపేట రూరల్ : విద్యాసంస్థల వేళలకు తగినట్లు ఆర్టీసీ బస్సులను నడిపించాలని ఎస్‌ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరహరి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక డిపోలో డీఎం ఆంజనేయులును కలిసి వినతిపత్రం అందించారు. ముఖ్యంగా అమీన్‌పూర్, జలాల్‌పూర్, వత్తుగుండ్ల, నిడుదుర్తి, బోయిన్‌పల్లి, కోటకొండ రూట్లపై దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కాశీ, నాయకులు ప్రవీణ్, శశికుమార్, నరేష్, అక్షయ్ పాల్గొన్నారు.

కనీస వేతనం ఇవ్వాలి

నారాయణపేట టౌన్ : గ్రామీణ ప్రాంతాలో పశువులకు ప్రాథమిక వైద్యం అందిస్తున్న పశు మిత్రలకు కనీసం వేతనం అమలు చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షకు వినతిపత్రం అందించారు. సంఘం నాయకులు మాట్లాడుతూ ఎలాంటి వేతనం లేకుండా పశుమిత్రలతో ప్రభుత్వం పని చేయించుకుంటోందని కలెక్టర్‌కు తెలిపారు. కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కన్వీనర్ బాల్‌రాం, పశుమిత్రల సంఘం జిల్లా నాయకులు భువనేశ్వరి, చిట్టెమ్మ, ఉష, అనురాధ, మమత, విజయలక్ష్మి, సత్యమ్మ, సంతోష, కూర్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

జోరుగా ప్రచారం

నారాయణపేట టౌన్ : తెలుగు దేశం పార్టీ ఇంటింటి ప్రచారం పట్టణంలో జోరుగా సాగుతోంది. కార్యక్రమంలో భాగంగా సోమవారం పట్టణంలోని 3,4,10,13,15,18 వార్డుల పరిధిలోని గాంధీనగర్, సింగార్‌బేస్ వీధుల్లో నియోజకవర్గ కో-ఆర్డినేటర్ ఆధ్వర్యంలో ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలను పంపిణీ చేశారు. తెలుగు దేశం హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు గోపాల్ యాదవ్, నాయకులు భాస్కర్, శివకుమార్, వద్ది నారాయణ, యాబన్న చౌదరి, అవుటి వీరన్న, గోపి, బలిజ వీరన్న, బన్నయ్య స్వామి, సత్యనారాయణ గౌడ్, కిష్టప్ప, కార్యకర్తలు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాల కూల్చివేత



కూల్చివేతలో పాల్గొన్న గ్రామస్తులు

మాగనూర్: మండల కేంద్రంలోని హౌసింగ్ బోర్డు (పుకాట్‌నగర్) కాలనీకి వెళ్ల దారిని అక్రమించి గ్రామానికి చెందిన రవి కాంప్లెక్స్ నిర్మాణం చేపటడ్డంతో సోమవారం కూల్చివేశారు. అనేక సార్లు గ్రామ పంచాయతీ నుంచి నోటీసులు జారీ చేసినా స్పందించక పోవడంతో చర్యలు తీసుకున్నామని సర్పంచ్ రాజు తెలిపారు. పంచాయతీ తీర్మానంతో గ్రామస్తుల ఆధ్వర్యంలో కూల్చివేశామన్నారు. గ్రామ పెద్దలు, యువకులు, వివిధ పార్టీల నాయకులు, వార్డుమెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కళాజాతా



ఊట్కూరు: మండల పరిధిలోని సమస్తాపూర్ గ్రామంలో సోమవారం పోలీసు కళాజాతా బృందం ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఎస్పీ ఆదేశాల మేరకు కళాజాత బృందం బాల్య వివాహాలు, బాలకార్మిక వ్యవస్థ, అంటరానితనం, సైబర్ నేరాలపట్ల అవగాహన కల్పించారు. సర్పంచ్ పాపమ్మ, కళాబృందం సభ్యులు సురేందర్‌గౌడ్, రాజనర్సయ్యగౌడ్, లింగం తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూలు

కోస్గి: ప్రభుత్వం మైనార్టీ కార్పొరేషన్ ద్వారా ఇచ్చే రాయితీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు సోమవారం స్థానిక మండల పరిషత్ సమవేశ మందిరంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎస్‌బీఐ కోస్గి వారు 45 మందికి, ఎస్‌బీఐ సర్జఖాన్‌పేట వారు 20 మందికి, ఏపీజీవీబీ గుండుమాల్ వారు 27 మందికి ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తం 129 మంది దరఖాస్తు చేసుకోగా 37 మంది గైర్హాజరయ్యారు. ఎంపీడీఓ వెంకటయ్య, ఎంపీఓ రహమత్ ఆయా బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.



వారాంతపు సెలవులు అమలు చేయాలి



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

మక్తల్: మున్సిపల్ కార్మికులకు వారాంతపు సెలవులు అమలు చేయాలని సీఐటీయూ అనుబంధ సంఘం తెలంగాణ మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియాన్ ఆధ్వర్యంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని అన్నారు. జనాభా పెరుగుదలకు అనుగుణంగా కార్మికులను నియమించాలని కోరారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రాంరెడ్డి, మండల కన్వీనర్ గోవిందురాజులు, కర్రెం కృష్ణ, బాలస్వామి, వెంకటస్వామి, సయ్యద్‌జాకీర్ అనిత, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

మాగనూర్: సమస్యల పరిష్కారం కోసమే నెలకు ఒకసారి గ్రామసభ ఏర్పాటు చేస్తామని మాగనూర్ గ్రామ సర్పంచ్ రాజు అన్నారు. సోమవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక సభ నిర్వహించి గ్రామంలోని పలు సమస్యలపై తీర్మానం చేపట్టారు. అందులో ముఖ్యంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ముందు వారి అనుమతితో వ్యాపార సముదాయల ఏర్పాటు, గ్రామంలో గల ప్రభుత్వ భూములను గుర్తించి కంచె నిర్మించడం , పురాతన రోడ్ల గుర్తింపు, అక్రమ నిర్మాణాల తొలగింపు వంటి ప్రధానమైన అంశాలపై చర్చించి ఆమోదించారు. ఎంపీపీ శ్యామలమ్మ, ఉపసర్పంచ్ సుధా, ఎంపీఓ జైపాల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి నర్సప్ప, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు కృష్ణయ్య, అశోక్‌గౌడ్, పల్లెమారెప్ప, వాకిటి వెంకటయ్య, అంజనేయులు, భరత్ తదితరులు పాల్గొన్నారు.

బీరప్ప బండారు ఉత్సవాలు



బండారోత్సవంలో పాల్గొన్న భక్తులు

నారాయణపేట రూరల్ : మండలంలోని సింగారం గ్రామంలో బీరప్ప బండారు ఉత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఐదేళ్లకు ఒకసారి నిర్వహించే ఉత్సవాల్లో భాగంగా యానగుంది బీరప్ప, సింగారం బీరప్ప స్వాముల జోడు పల్లకీసేవా గ్రామ పురవీధుల గుండా కనుల పండువగా సాగింది. దారిపొడువునా మహిళలు నీళ్ల పోస్తూ, హారతితో స్వాగతం పలికారు. వాగుతీరంలో గంగాస్నానం అనంతరం ఆలయానికి భక్తి శ్రద్ధలతో ఊరేగింపుగా తీసుకుని వచ్చారు. మహిళలు జ్యోతి ఊరేగింపు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు అనంతరం ఒకరిపై మరొకరు బండారు (పసుపు) చల్లుకున్నారు. విండో చైర్మన్ నర్సింహారెడ్డి, ఉప సర్పంచ్ సిద్దప్ప, మల్లప్ప, హన్మంతు, బుగ్గప్ప, సిద్రామప్ప, నర్సప్ప, బాలప్ప పాల్గొన్నారు.

పిచ్చుకలతో పర్యావరణానికి మేలు



విద్యార్థులు తయారు చేసిన సామగ్రి

కోస్గి: ప్రపంచ ఊర పిచ్చుకల సంరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం ముశ్రీఫా జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పక్షుల సంరక్షణతో పర్యవరణానికి కలిగే లాభాలను వివరిస్తూ అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. పాఠశాల సైన్స్ ఉపాధ్యాయుడు వార్ల మల్లేశం ఊర పిచ్చుకలు అంతరించిపోతున్న తీరును, వాటి తగ్గుదల వల్ల వ్యవసాయానికి, పర్యావరణానికి కలుగుతున్న నష్టాన్ని చిత్రాలతో సమగ్రంగా వివరించారు. విద్యార్థులతో అట్ట ముక్కలు, ఇతర వస్తువులతో ఊర పిచ్చుకల సంరక్షణ కోసం నీరు తాగే పాత్రలు, ఆవాస స్థానాలు, నివాస గూళ్లు, ఇతర సంరక్షణ సామాగ్రిని తయారు చేయించారు. విద్యార్థులతో చర్చావేదిక ఏర్పాటు చేశారు. పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



కున్సీలో పనులు ప్రారంభిస్తున్న నాయకులు

ధన్వాడ: మండలంలోని మందిపల్లి గ్రామంలో సోమవారం సీసీ రోడ్డు పనులను సర్పంచ్ విమలాదేవి ప్రారంభించారు. రూ.8 లక్షలతో పనులను ప్రారంభించామని ఆమె తెలిపారు. ఎంపీటీసీ ప్రమీలమ్మ, ఉపసర్పంచ్ రామకృష్ణా రెడ్డి, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా: మండల పరిధిలోని కున్సి గ్రామంలో సోమవారం సర్పంచ్ శంకరమ్మ, ఎంపీటీసీ రాంచందర్, ఉప సర్పంచ్ మణెమ్మ సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సోమశేఖర్‌గౌడ్, మాజీ ఉప సర్పంచ్ నల్లె నర్సప్ప, నాయకులు రాజప్పగౌడ, పిట్టల్ సిద్దప్ప ,రాంచందర్‌మాస్టర్, మహాదేవ్ పాల్గొన్నారు.

మాగనూర్: మండల పరిధిలోని అడవిసత్యారం గ్రామంలో సీసీ రోడ్డు పనులను సోమవారం గ్రామ సర్పంచ్ జానకమ్మ టెంకాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఉపసర్పంచ్ తిరుపతమ్మ, ఎంపీటీసీ, పంచాయతీ కార్యదర్శి ఆనంద్, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోండి

నారాయణపేట రూరల్ : నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన ఓ ప్రైవేటు పాఠశాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పీడీఎస్‌యూ నాయకులు సోమవారం డీఈఓ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. దామరగిద్ద మండల కేంద్రంలో నడుస్తున్న సదరు పాఠశాల యాజమాన్యం ఎలాంటి అనుమతి లేకుండా ఆదివారం విద్యార్థులను విహారయాత్రకు తీసుకుని వెళ్లారని, రాత్రివేళలలో తిరిగి వచ్చిన తర్వాత ఉడ్మల్‌గిద్దకు చెందిన చిన్నారిని ఇంటి దగ్గర వదలడంపై నిర్లక్ష్యంగా వ్యవహరించారని చెప్పారు. పాప మేనమామ బైక్‌పై తీసుకుని వస్తున్న క్రమంలో ఆటో ఢీ కొట్టిందని, ఈ ప్రమాదంలో అమ్మాయి ఐశ్వర్యకు ఆమె మేనమామ హన్మంతుకు తీవ్ర గాయాలయ్యాయని పేర్కొన్నారు. రామకృష్ణ, గోపాల్, నర్సింహా, వీరప్ప, గోపాల్, రాజు, అశోక్, వెంకటప్ప పాల్గొన్నారు.